ప్రజాశక్తి
శనివారం 9 డిసెంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రస్తుత ఓటర్లు 19.20 లక్షలు

◆ జాబితాల తయారీలో యంత్రాంగం నిమగ్నం
◆ రాజకీయ పార్టీల్లో మొదలైన వేడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల వేడి మొదలవుతోంది. ఓటర్ల జాబితాల తయారీలో ఇప్పటికే విశాఖ జిల్లా అధికార యంత్రాంగం నిమగ్న మైంది. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులతో కలిపి చూస్తే ఈ నెల 5 నాటికి విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 19,20,575 మంది ఓటర్లు లెక్క తేలారు. ఇంకా చేర్పింపులు, తొలగింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థలు ఈ ఓటర్ల జాబితాల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అధికార వైసిపి వీరిని నియమించినందున రాజకీయ కక్షలతో పలుచోట్ల ఓట్ల తొలగింపు బాహాటంగానే జరుగుతుందన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. విశాఖ నగరంలో మరింతగా ఈ పరిస్థితి ఉందని తెలుగుదేశం, జనసేన పార్టీలు నిత్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పక్కాగా ప్రజల సమాచారం, వారు ఉన్నదీ లేనిదీ, ఉపాధి కోసం వలస వెళ్లిపోతే ఆ డేటా.. ఇలా అన్నింటినీ క్రోడీకరించుకునే ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు విశాఖ జిల్లా ఎన్నికల గణం చెబుతోంది.



ఓటరు జాబితాలపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున (ఫైల్)

అసెంబ్లీలవారీగా చూస్తే..

భీమిలి అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అక్టోబర్ 27 నాటికి 3,39,909 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి 11,643 నూతన ఓట్లు చేర్చారు. 8046 ఓట్లు తొలగించగా 9620 ఓట్లు మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి ఈ నియోజకవర్గంలో 3,43,506 ఓట్లతో ఓటరు జాబితాను సిద్ధం చేశారు.

విశాఖపట్నం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 27 నాటికి 2,65,273 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ నాటికి నూతనంగా 12,011 ఓట్లు చేర్చారు. 5898 ఓట్లు తొలగించారు. 16,740 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 2,71,386 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

విశాఖపట్నం దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 27 నాటికి 2,17,130 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 6,342 వేల ఓట్లు చేర్చారు. 15,964 ఓట్లు తొలగించగా 8,745 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 2,07,508 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

విశాఖపట్నం ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 27 నాటికి 2,71,737 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 9,848 ఓట్లు చేర్చారు. అదే విధంగా 5196 ఓట్లు తొలగించగా 16779 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 2,76,389 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

విశాఖపట్నం పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో మిగతా 2లో..



సముద్రంలో సాగుతున్న నావికాదళ విన్యాసాలు

నావికా దళ విన్యాసాలు అదుర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆర్‌కె బీచ్ వద్ద తలపెట్టిన ఫుల్ ఆపరేషన్ డెమో విన్యాసాలు అట్టహాసంగా సాగాయి. మర్గన్ హెలీకాప్టర్ల విన్యాసాలు, బాంబింగ్, రెస్క్యూ ఆపరేషన్, పారాషూట్ విన్యాసాలు ఔరా అనిపించాయి. చేతక్ హెలీకాప్టర్ ద్వారా జాతీయ జెండా ఎగరవేయడం, యుఎక్స్ హెలీకాప్టర్ విన్యాసాలు, హాక్ విమానాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వీటితోపాటు పి8ఐ విమానం నుంచి బాంబింగ్ చేసే విధానం అందరినీ అలరించింది. అనంతరం నేవీ స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు, శరత్ కుమార్ మిగతా 2లో..



శత్రు మూకలను పట్టుకున్న నావికులు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

▶ వార్త 2లో..

అంబరాన్ని తాకిన కొండగుడి సంబరం

▶ వార్త 2లో..

జనసేన పొలిటికల్ కాంట్రాక్ట్ పార్టీ

▶ వార్త 2లో..

అధికారంలోకి వస్తే..

కొత్త బోట్లు కొనుగోలుకు ఆర్థిక సాయం



బాధితులకు పరిహారం అందజేస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 50 బోట్లు అగ్నికి ఆహుతికాగా రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన వారికి చేసిన ఆర్థిక సాయం తూతూ మంత్రంగా ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే కొత్త బోట్లు కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమైన బోట్లు కోల్పోయిన వారికి, వాటిలో పని చేసే కళాసీలకు తెలుగుదేశం పార్టీ తరపున ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బోటు యజమానికి రూ.లక్ష, పాక్షికంగా దగ్ధమైన బోటుకు రూ.50 వేలు, కళాసీలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని పార్టీ తరపున అచ్చెన్నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.10 వేలు ఇస్తున్నట్లు జగన్ ప్రభుత్వం గొప్పలు చెబుతోందని అన్నారు. టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు మిగతా 2లో..

కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో ఇగ్నో ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విద్యా రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో జరిగిన ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకొని సంతకాలు చేసినట్టు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు జి.ధర్మారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, కెన్యా అధ్యక్షులు విలియం సమోయి రూటోల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు, కెన్యా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. ఒప్పందంలో భాగంగా ఇగ్నో - కెన్యా ఓపెన్ యూనివర్సిటీల మధ్య వివిధ అంశాలలో పరస్పర సహకారం ఉంటుందని, రెండు సంస్థల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, అత్యున్నత సాంకేతికత సహకారంతో విద్యాబోధన, కెన్యా మిగతా 2లో..

రైతులను ఆదుకుంటాం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - దేవరాపల్లి : తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.అలమండ పరిసర ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా తడిచి ఆరబెట్టిన ధాన్యం రాశులను, దెబ్బతిన్న పంటలను ఆయన అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పటాన్ శెట్టితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల నుంచి కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. సబ్సిడీపై మినుము విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పంట పొలాల్లో తడిచిన కంకులపై ఉప్పు నీటి ద్రవాన్ని మంత్రి పిచికారీ చేశారు. రవాణా, హమాలీ ఛార్జీలు, గోనె సంచుల డబ్బులను కూడా త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి, వ్యవసాయ శాఖ మిగతా 2లో..



తడిసిన కంకులపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న బూడి

మొదటి పేజీ తరువాయి..

ప్రస్తుత ఓటర్లు 19.20 లక్షలు

అక్టోబర్ 27 నాటికి 2,21,340 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 10,176 ఓట్లు చేర్చారు. అదే విధంగా 17,761 ఓట్లు తొలగించగా 5,952 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 2,13,755 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 27 నాటికి 3,12,809 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 7,072 ఓట్లు చేర్చారు. 3,077 ఓట్లు తొలగించగా 7,445 వేల ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 3,16,804 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 27 నాటికి 2,87,484 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 9,804 ఓట్లు చేర్చారు. 6,061 ఓట్లు తొలగించగా 4,203 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5 నాటికి నియోజకవర్గంలో 2,91,227 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో అక్టోబర్ 27 నాటికి 19,15,682 ఓట్లు ఓటరు జాబితాలో ఉండగా డిసెంబర్ 5 నాటికి నూతనంగా 66,896 ఓట్లు చేర్చారు. 62,003 ఓట్లు తొలగించగా 69,484 ఓట్లలో మార్పులు చేశారు. చివరగా డిసెంబర్ 5కి నియోజకవర్గంలో 19,20,575 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు.

నావికా దళ విన్యాసాలు అదుర్స్

సింగ్ బాబు సారథ్యంలో సాగిన నేవీ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల ఫైనల్ డెమోనిస్ట్రేషన్ ఆదివారం జరగనుంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రైతులను ఆదుకుంటాం

అధికారులు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబూరావు, స్థానిక సర్పంచ్ దాడి జగన్, విఆర్‌ఒ పోతల శంకర్, ఎంపిటిసి పోతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బోట్లు కొనుగోలుకు ఆర్థిక సాయం

అందరికీ రూ.4 వేలు చొప్పున ఇచ్చామని, వైసిపి ప్రభుత్వం వచ్చాక అతి తక్కువ మందికి ఇస్తున్నారని ఆరోపించారు. మత్స్యకార భరోసా అందరికీ అందడం లేదన్నారు. మత్స్యకారులకు ఐదు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి చెప్తున్నారని, అయితే ఏ ఒక్క కార్పొరేషన్‌కూ పైసా నిధులు ఇవ్వలేదని అన్నారు. మత్స్య శాఖ మంత్రిగా ఉన్న సీదరి అప్పలరాజు మత్స్యకారులను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 50 బోట్లు కాలిపోయి వందలాది మంది మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత టిడిపి, జనసేనలు ధర్నాలు చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గంగవరం పోర్టు వద్ద మినీ జెట్టీ ఏర్పాటు చేస్తామని, ఆయిల్ సబ్సిడీ పెంపుదల ఉంటుందని తెలిపారు. సభలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్టీ దక్షిణ ఇంచార్జ్ గండి బాబ్జీ, పార్టీ విశాఖ పార్లమెంట్ ఇంచార్జి ఎం.శ్రీ భరత్ మాట్లాడారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, డి.రామారావు పాల్గొన్నారు.

కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో ఇగ్నో ఒప్పందం

ఓపెన్ యూనివర్సిటీ సిబ్బందికి శిక్షణ, ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల రూపకల్పన, ఆన్ లైన్ విద్యాబోధనలో సహకారం అందించడం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనివ్వడం, విద్యా సంబంధిత వనరులు పంచుకోవడం వంటివి ఈ ఒప్పందంలో భాగమన్నారు. అలాగే కెన్యా ఓపెన్ యూనివర్సిటీ తమ దీర్ఘకాల ప్రయోజనం నిమిత్తం ఇగ్నో నుంచి విద్య, ఆర్థిక సహకారాన్ని కూడా ఈ ఒప్పందం ద్వారా కోరవచ్చునున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక రంగాలలో ముందుకెళ్లడానికి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

జనసేన పొలిటికల్ కాంట్రాక్ట్ పార్టీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనసేన పొలిటికల్ కాంట్రాక్టు పార్టీగా మారిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. తెలంగాణలో బిజెపితో అధికారికంగా పొత్తు అంటూ ఒక కాంట్రాక్ట్, ఆంధ్రలో అన్ అఫీషియల్‌గా టిడిపితో పొత్తు నడుపుతూ మరో పొలిటికల్ కాంట్రాక్ట్ ఆ పార్టీ చేపట్టిందని ఆరోపించారు. శుక్రవారం ఉదయం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ మతి చెడిందని, మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా మాట్లాడుతున్నాడని అన్నారు. ఎన్నికల ఫలితాలే రాజకీయ పార్టీ నాయకుని స్థాయి, అతని నాయకత్వ బలానికి కొలమానంగా నిలుస్తాయన్నారు. దీన్నిబట్టి చూస్తే పవన్ కల్యాణ్ కన్నా బర్రెలక్కనే నయమనిపిస్తోందని తెలిపారు. తెలంగాణలో బిజెపిని బలోపేతం చేస్తానని ప్రగల్భాలు పలికిన పవన్ అక్కడ బలం లేక చతికిలపడ్డారని, ఆంధ్రలో మాత్రం అధికారంలో ఉన్న వైసిపిని కూలదోస్తానని కబుర్లు చెబుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను తాను చెప్పాను కాబట్టే కేంద్రం నిలిపివేసిందని పవన్ చెబుతున్నారని, అదంతా ఉత్తిదేనని ఆయన అన్నారు. కేంద్రం ఆ ప్రతిపాదనను నిలిపివేసినట్లు అధికారికంగా ఎక్కడైనా చెప్పిందా..? అలాంటి ప్రకటన ఏమైనా అధికారికంగా విడుదల చేసిందా..? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు.

అంబరాన్ని తాకిన కొండగుడి సంబరం



ఉత్సవంలో పాల్గొన్న ప్రజానీకం

ప్రజాశక్తి -కలెక్టరేట్ : పాత నగరంలోని కొండ గుడి పండగగా పేరొందిన అమలోద్భవి (మేరీ) మాత ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు కొండపై ఉన్న లూర్థుమాత గుహ వద్ద తెలుగులో, ప్రధాన దేవాలయంలో ఆంగ్లంలో దివ్యపూజా బలి నిర్వహించడం ద్వారా ఉత్సవాల ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం గుహ వద్ద విశాఖ అగ్రపీఠాధిపతులు డాక్టర్ మళ్లవరపు ప్రకాష్‌చే పోంటిపికల్ దివ్య పూజా బలిని నిర్వహించారు. భక్తులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సర్వ మానవాళి కోసం మేరీమాత చేసే ప్రార్థనలను అందరూ అనుసరించాలన్నారు. దివ్య పూజా బలిని నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. మధ్యాహ్నం పాత పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ ఆలాయిసిస్ పాఠశాల నుంచి అశేష భక్తజనం మేరీ మాత స్వరూప తేరును ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. భక్తుల సందర్శనార్థం ఆలయం బయట ఉంచారు. అనంతరం భక్తులంతా మొక్కులు చెల్లించుకున్నారు. మేరీ మాత ముందు మోకరిల్లి కష్టనష్టాలను చెప్పుకున్నారు. చివరిగా లూర్థుమాత గుహ వద్ద దివ్య పూజా బలితో మహోత్సవాన్ని ముగించారు.

కిక్కిరిసిన దారులు

అమలోద్భవి మాత దర్శనానికి భక్తులు పోటెత్తడంతో టౌన్ కొత్త రోడ్డు నుంచి పాత పోస్టాఫీసు వరకు దారులన్నీ కిక్కిరిసిపోయాయి. కొండపై ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా తయారైంది. నగరంతోపాటు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వేలాది మంది భక్తజనం తరలివచ్చారు. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోలేదు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, సూచనల బోర్డులు పక్కాగా ఏర్పాటు చేయడంతో భక్తులు సాఫీగా రాకపోకలు సాగించారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న జెసి విశ్వనాథన్, పక్కన సురేష్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. ఆయా కంపెనీల పరిధిలో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్స్ తప్పకుండా నిర్వహించాలని వివిధ కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సేఫ్టీ కమిటీలను నియమించుకోవాలన్నారు. అత్యవసర సమయంలో తక్షణమే స్పందించే విధంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో చేపడుతున్న భద్రతా చర్యలకు, మాక్ డ్రిల్స్‌కి సంబంధించిన నివేదికలు సమర్పించాలన్నారు. క్రమం తప్పకుండా సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలని, కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్న చోట్ల పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రమాదాల జరిగినప్పుడు అప్రమత్తం చేసే విధంగా సెన్సార్లు ఏర్పాటు చేయాలని, ఆటోమేటిక్ మెకానిజం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వైద్య బృందాలను నిత్యం అందుబాటులో ఉంచుకోవాలని, సమీప ఆసుపత్రితో అనుసంధానమై ఉండాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. సేఫ్టీ బృందాలు తరచూ కంపెనీలను సందర్శించాలని, అక్కడ పరిస్థితులపై నివేదికలు సమర్పించాలని సూచించారు.

21న రాష్ట్ర స్థాయి మాక్ డ్రిల్స్

ఈ నెల 21న రాష్ట్ర స్థాయిలో వివిధ కంపెనీల పరిధిలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలో మాక్ డ్రిల్స్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని కంపెనీలు భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

జిల్లాలో గుర్తించిన ఆంధ్రా పెట్రో కెమికల్, కేంటెక్ కంపెనీల పరిధిలో జిల్లా స్థాయి మాక్ డ్రిల్స్ జరుగుతాయని, జిల్లాలోని అన్ని కంపెనీలు ఆయా ప్రతినిధులను పంపించాలని అన్నారు. సమావేశంలో ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్ -2 కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలోని అల్లూరి కోచింగ్ సెంటర్ గ్రూప్ 2 కోచింగ్ ఇస్తోందని ఆర్గనైజర్ విఎస్.పద్మనాభరాజు తెలిపారు. డాబాగార్డెన్స్‌లో ఉన్న విజ్ఞాన కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఇప్పటికే క్లాసులు ప్రారంభమయ్యాయని అన్నారు. రెండు నెలలు క్లాసులు వుంటాయన్నారు. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ, ఎపి హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్ సబ్జెక్ట్స్‌కు కోచింగ్ అత్యంత అనుభవిజ్ఞులతో ఇస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 8374537181 నెంబరును సంప్రదించాలని కోరారు.

2024లో జనసేన బిజెపిలో విలీనం ఖాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన పార్టీ బిజెపిలో విలీనం కావడం ఖాయమని, ఇది 2024లోనే జరుగుతుందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఎ.పాల్ అన్నారు. ఆశీలుమెట్టలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో శుక్ర వారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జివిఎంసి 65వ వార్డు సంజీవిగిరికాలనీ, కెఎల్ రావు నగర్‌లో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పన ప్రభుత్వ బాధ్యత అన్నారు.వార్డులన్నీ ప్రగతిపథంలో దూసుకపోతున్నాయని, విశాఖ దేశంలోనే ఆదర్శనగరం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం, నగిశెట్టి శ్రీనివాస్, జుత్తు లక్ష్మి, మంత్రి మంజుల, అడిగర్ల రమణ, పుష్ప, పెంటయ్య రెడ్డి, విఘ్నేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

ప్రజాశక్తి - భీమునిపట్నం :గుంటూరు జిల్లా బాపట్లలోఈ నెల 9,10,11 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ -9 విభాగంలో షూటింగ్ బాల్ పోటీలకు స్థానిక బ్యాంక్ కాలనీలోని విద్యాసాగర స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల అధ్యక్షులు డాక్టర్ కె సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ కె శాంత, డైరెక్టర్ కె నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. రాష్ట్రపోటీలకు ఎంపికైన విద్యార్థులు కె హారిక, పి రోహిణి, వి సాయి సంపత్, ఎస్ రామ్ చరణ్‌లతోపాటు పిఇటి దినేష్‌ను శుక్రవారం పాఠశాలలో అభినందించారు

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి- సీతమ్మధార : రక్తదానంతో ఎందరి ప్రాణాలనో కాపాడవచ్చుని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అఖిలభారత స్థాయిలో నిర్వహిస్తున్న బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ఇటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహించిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌ను అభినందించారు.

విజయవంతంగా ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఉక్కునగరం : 87వ వార్డు గవర వీధి వెల్ఫేర్ సెంటర్ గీతం డీమ్డ్ వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్యపరీక్షలతోపాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్‌రాజ్, విజయరామరాజు, జిల్లా కార్యదర్శి వర్రే రాంబాబు, కల్లేపల్లి శ్రీనివాస్‌వర్మ, సూరిశెట్టి పెంటారావు, దానయ్య, పావాడ రమణమూర్తి, పివిఎన్ మూర్తి, దుగ్గా పెంటయ్య, శాంతారావు, మల్లా రాము, బొట్టా ప్రకాష్, జోసెఫ్, గండేపల్లి రాము, పోతల కృష్ణ, భాగ్యలక్ష్మి, జాన్ రమేష్, కడుపుట్ల శ్రీను, సిహెచ్ నూకరాజు, శ్రీను, ఎటిఎన్ మూర్తి, దాలయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గండిగుండం, రామవరం గ్రామాలలో సచివాలయ కార్యదర్శుల అద్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కంటుభుక్త రామానాయుడు, సర్పంచ్‌లు గండ్రెడ్డి శ్రీను, యర్రా పైడిరాజు, రామవరం ఎంపిటిసి గొలగాని కృష్ణ, ఉప్పాడ అప్పారావు, పివివి ప్రసాద రావు, పిల్లా చిన్నా రావు, నిమ్మకాయల అప్పలరాజు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమిష్టి పోరాటం

అంబేద్కర్ సొసైటీ రూబీ జూబ్లీ వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం



మాట్లాడుతున్న జెడి.శీలం

ప్రజాశక్తి- సీతమ్మధార : అంబేద్కర్ ఆశయసాధనకు అనుగుణంగా యువతకు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం సమిష్టి పోరాటం చేయాలని కేంద్ర మాజీమంత్రి జెడి శీలం పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ రూబీ జూబ్లీ(40ఏళ్లు) వేడుకల్లో భాగంగా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ఎంతో కష్టపడి తాము ఈ స్థాయికి వచ్చామని, బాధ్యతాయుతంగా పని చేస్తేనే హక్కులు సాధించగలమన్నారు.

ఎయు విశ్రాంత విసి, యుపిఎస్‌సి మాజీ చైర్మన్ ఆచార్య కెఎస్. చలం అధ్యక్షోపన్యాసం చేస్తూ దేశంలో మూడు అగ్రకులాలే ఆధిపత్యం, అధికారం చెలాయిస్తున్నాయని, పెట్టుబడిదారులే వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారన్నారు. దేశంలో 15 శాతం ఉన్న దళితుకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఒక శాతమే దక్కాయన్నారు. ఆదాయంలో దళితులు అత్యల్పంగా ఉన్నా, దేశంలో ఉద్యమాలకు దళితులు, ఆదివాసీలే నాయకత్వం వహిస్తున్నారన్నారు. 90 శాతం మంది దళితులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. కులాల ఆధిపత్యం పోతేనే రాజ్యాంగం ప్రకారం హక్కులు సాధించగలమన్నారు. దక్షిణాదిలో 1200 కులాలకు ఎటువంటి గుర్తింపు లేదన్నారు.

అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ 40 ఏళ్ళుగా అంబేద్కర్ భవనం అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో భవన కార్యదర్శి జెవి ప్రభాకర్, సత్యనారాయణ, ఆచార్య పిడి సత్యపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, డాక్టర్ జయరాజ్, భవనం వ్యవస్థాపకులు రాజారావు, ఐఆర్ఎస్ అధికారి జంగాలయ్య పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో

విజయవంతంగా అరుదైన కంటి ఆపరేషన్

ప్రజాశక్తి- వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో గ్లకోమా నివారణకు అరుదైన గ్లూకోస్ ఐ-స్టెంట్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. గ్లకోమా రోగులలో కంటి లోపల ఒత్తిడిని గణనీయంగా తగ్గించి, వ్యాధిని అదుపులో వుంచదానికి గ్లూకోస్ ఐ స్టెంట్ అనే అతి సూక్ష్మ పరికరాన్ని కంటిలో అమర్చే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు.

అమెరికాలోని గ్లూకోస్ ఇంటర్నేషనల్ సంస్థ 2012లోనే ఐ-స్టెంట్ పరికరానికి అమెరికన్ ఎఫ్‌డిఎ అనుమతి పొంది వినియోగిస్తోంది. 2018లో దీన్ని మరింతగా ఆధునీకరించి, 360 మైక్రోమీటర్ పరిమాణంలో టైటానియం మెటల్ రూపొందించారు. గతనెలలో భారత్‌లో అందుబాటులోకి తెచ్చిన ఈ అతిసూక్ష్మ పరికరాన్ని, ఇంతలోనే శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో వినియోగించడం, విజయవంతంగా ఆపరేషన్ చేసి గ్లకోమా రోగులకు అమర్చారు. గ్లూకోస్ ట్రాబెక్యులర్ మైక్రో బైపాస్ టెక్నాలజీ ద్వారా రెండు బైపాస్ మార్గాలు ఏర్పరచి కంటి లోపల ద్రవాన్ని స్కెల్మెన్ ద్వారం ద్వారా ప్రవహించడానికి ఈ స్టెంట్‌ను అమర్చే ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా అత్యాధునిక ఆపరేషన్‌ల నిర్వహణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి మరోమైలురాయి చేరుకుంది. అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన శంకర్ ఫౌండేషన్ గ్లకోమా వైద్యుల బృందాన్ని యాజమాన్యం అభినందించింది.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోండి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ప్రజాశక్తి- పెందుర్తి :టెక్నాలజీ విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం నరవ విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌అండ్ టెక్నాలజీ కళాశాలలో టెక్నో ఫ్రెండ్‌షిప్‌పై సెమినార్ నిర్వహించారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీలో మంచి నైపుణ్యం సంపాదించి, ప్రతిఒక్కరూ సొంతంగా కంపెనీలు పెట్టే దిశగా ఎదగాలన్నారు. విద్యార్థులు ఇటువంటి సెమినార్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ చందన, బి. జీవనరావు, ఆడారి తులసినాయుడు, ఆధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

పవన్‌ను విమర్శించే స్థాయి ఉందా?

మంత్రి అమర్‌పై మాజీ ఎమ్మెల్యే పంచకర్ల మండిపాటు

ప్రజాశక్తి-సీతమ్మధార : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాధ్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మండిపడ్డారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి నుంచి వచ్చిన స్క్రిప్ట్ చదవడం తప్ప, మంత్రి అమర్‌కు సొంతంగా మాట్లాడే సత్తా లేదని అందరికీ తెలిసిందేనన్నారు. జిల్లాకు, నియోజకవర్గానికి ఏమీ చేయడం చేతకాని అమర్, రాష్ట్రమంత్రిగా అట్టర్‌ప్లాఫ్ అయ్యారన్నారు. జనసేనపై అమర్ వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, లేకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, వైసిపి విజయం సాధించకుంటే అమర్ ఇంటికి పోతాడా అని సవాల్ విసిరారు. పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ, టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి అమర్‌తోపాటు వైసిపి నేతలు దోచుకున్న వేల ఎకరాల భూములను వెనక్కు రప్పిస్తామన్నారు. జనసేన నేతలు టివిఎస్ఎన్. రాజు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పలు ఆలయాల్లో హుండీల చోరీ

ప్రజాశక్తి- కె.కోటపాడు :మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో పలు ఆలయాల హుండీలు గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఆ గ్రామంలోని మరిడి మాంబ, దుర్గాల అమ్మమ్మ వారు, సాయిబాబా ఆలయం, ఆంజనేయ స్వామి గుడిలో ఉన్న హుండీలకు ఉన్న తాళాలను దుండగులు తొలగించి అందులో ఉన్న నగదును అపహరించారు. గ్రామ మధ్యలో ఉన్న సాయిబాబా ఆలయములో ఉన్న హుండీ చోరీకి గురవడం పట్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటుగా ఆర్లి గ్రామంలోని పైడిమాంబ ఆలయంలో ఉన్న ఉండి కూడా వీటితో పాటుగ చోరీకి గురైందని గ్రామస్తులు తెలిపారు. గుల్లిపల్లి గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ పక్కన ఉన్న మలిరెడ్డి నాగేశ్వరరావుకు చెందిన మూడు ట్రాక్టర్లకు గల బ్యాటరీలను 15 రోజుల క్రితం అపహరణకు గురైందని నాగేశ్వరరావు స్థానిక విలేకరుల వద్ద వాపోయారు. కాగా హుండీల చోరీ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు.

సోమశేఖర శర్మకు ఘననివాళి

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రఖ్యాత చరిత్రకారులు, శాసనపరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ జయంతిని స్థానిక బివికె. కళాశాలలో మల్లంపల్లి సోమశేఖర శర్మ చారిత్రక అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎయు చరిత్ర పురావస్తుశాస్త్ర విశ్రాంత ఆచార్యులు సిహెచ్ సోమ సుందరరావు మాట్లాడుతూ, అజరామరమైన చరిత్రకు సోమశేఖర్‌శర్మ చేసిన సేవ విశిష్టమైనదన్నారు. ఆంధ్రుల చరిత్రను ప్రపంచానికి తెలియజెప్పడంలో మల్లంపల్లిని మించిన వారే లేరన్నారు. సంస్థ చైర్మన్, ఎయు చరిత్ర, పురావస్తుశాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ కొల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ, సోమశేఖరశర్మ ఒక్క చరిత్రలోనే కాకుండా సాహితీవేత్తగా, శాసన పరిశోధకులుగా, లిపి కర్తగా, పత్రిక సంపాదకులుగా విభిన్న రంగాల్లో సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. బివికె.కళాశాల ప్రిన్సిపల్ రమ ఆచంట మాట్లాడుతూ, చరిత్రతో పాటు ఇతర ఆర్ట్స్ విభాగపు సబ్జెక్టులు పూర్వస్థితికి రావాలని ఆకాంక్షించారు. ఇంటెక్ మెంబర్ ఎడ్వర్డ్‌పాల్ మాట్లాడుతూ చరిత్రకు పూర్వ వైభవం తేవడానికి సోమశేఖర్‌శర్మ చారిత్రక అధ్యయన సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల సంస్థ ఆశయాలను, చేసిన కార్యక్రమాలను వివరించారు. వేంగిచాళుక్యులపై చరిత్రకారులు కెఎస్.కామేశ్వరరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు

అనాథ పిల్లలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న లక్ష్మి, బంగారునాయుడు దంపతులు

ప్రజాశక్తి-ఆనందపురం: : తాళ్లవలస చిన్నపిల్లల అనాథాశ్రమంలో 25 మంది పిల్లలకు మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీకి చెందిన శ్రీ దుర్గా ట్రాన్స్‌పోర్ట్ యజమాని షినగం బంగారునాయుడు, లక్ష్మి దంపతులు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

రేపు దయాల్‌బాగ్‌లో వస్తు ప్రదర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : నాణ్యతకు, మన్నికకు, తక్కువ ధరలకు పేరుగాంచిన దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనను ఈ నెల 10న ఆదివారం విశాలాక్షినగర్, దయాల్‌బాగ్ కాలనీ, దయాల్‌బాగ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ మైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దక్షిణామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గత 63 ఏళ్ళుగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో నాణ్యమైన చేనేత దుప్పట్లు, తువ్వాళ్ళు, షర్టింగ్ క్లాత్, డ్రెస్ మెటీరియల్స్, బనియన్లు, లెథర్ చెప్పులు, బూట్లు, ట్రావెల్ బ్యాగ్‌లు, సబ్బులు, అగరబత్తులు, ఆయుర్వేద మందులు అమ్మకానికి ఉంచనున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఆనందకుమార్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు అధ్యక్షులు గులిగిందల కృష్ణ ఆధ్వర్యంలో పలుఅభివృద్ధి పనులకు శుక్రవారం వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో ఉప్పర కాలనీలో సిసి రోడ్స్, సిసి డ్రెనేజీల నిర్మాణం, రూ.12.50 లక్షలతో శాంతినగర్‌లో, రూ.7.22 లక్షలతో ములగాడ కాలనీలో. రూ.ఐదు లక్షలతో ఎదురువానిపాలెంలో, రూ.7.78లక్షలతో గొందేసివానిపాలెంలో సిసి రోడ్లు, సిసి డ్రెన్స్ మరమ్మతులకు, రూ. 41.40 లక్షలతో గుల్లలపాలెం దగ్గర శ్రీహరిపురం మెయిన్ రోడ్డు నుంచి హెచ్‌పిసిఎల్ కాంపౌండ్ వాల్ వరకు స్ట్రాంగ్ వాటర్‌డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉప్పర కాలనీలో రూ. 19.80 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు.

గుల్లలపాలెంలో విశ్వేశ్వర దేవాలయంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన మంచినీటి బోరును ప్రారంభించారు. గుల్లల పాలెంలో నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పొడుగు రాజు, వేణుగోపాల్ రెడ్డి, అప్పల రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గిన్ని శ్రీను, రామారావు, జగన్నాధం, కన్నబాబు, పి. సురేష్, సత్యానందం, శ్రీరామ రెడ్డి, వంగ శ్రీను, కోట కృష్ణ, సుబ్బలక్ష్మి , వరలక్ష్మి , సత్యవతి, రాజేశ్వరి, గౌరమ్మ పాల్గొన్నారు.

వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా మందారెడ్డి


సత్తి మందా రెడ్డి

ప్రజాశక్తి - ఆరిలోవ : 12వ వార్డు సుందరయ్యనగర్‌కు చెందిన వైసిపి నేత సత్తి మందారెడ్డిని జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా నియమిస్తూ, అధికారులు శుక్రవారం నియామకపత్రాలను విడుదల చేసారు. 12 ఏళ్ళుగా పార్టీకి సేవలు అందిస్తున్న తనకు ఈ పదవి ఇవ్వడంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, తూర్పు సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైసిపి నాయకులు జివి, మాజీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్‌లకు సత్తి మందారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టాలకు పరిహారం : ముత్తంశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : తుపాను బాధిత రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో భీమిలి, నందపురం, పద్మనాభం మండలాల ఎంపిపి లు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్లు, ఎంపిటిసిలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తుఫానుకు దెబ్బతిన్న వరి పంటకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని,ఏ ఒక్క బాధిత రైతు ఆందోళన చెందనక్కర లేదన్నారు పంట నష్టం అంచనాలను రూపొందించాలని సమావేశానికి హాజరైన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్, ఎఒలు పాల్గొన్నారు

కొండవాలులో రక్షణగోడ నిర్మించాలి

- ప్రమాద భరిత ఇళ్లు పడిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలి
- జివిఎంసికి సిపిఎం ఆధ్వర్యాన శారదానగర్ వాసుల వినతి


సహాయ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శారదానగర్ వాసులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు శారద నగర్ కొండవాలు ప్రాంతంలో కొండచరియలు విరిగి పేదల ఇళ్లు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని ఆ ప్రాంత వాసులు, సిపిఎం జోన్ కార్యదర్శి డి అప్పలరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా ఇళ్లకు రక్షణగోడలను నిర్మించాలని కోరారు. ఈమేరకు శుక్రవారం జోనల్ కార్యాలయంలో సహాయక కమిషనర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో వరుసగా మూడు రోజులు వర్షాలకు ఐదోవార్డు , శారదనగర్ కొండవాలు ప్రాంతంలో దాదాపు 30ఏళ్లుగా నివాసముంటున్న ఇళ్లను ఆనుకుని కొండచరియలు విరిగిపడ్డాయని, దీంతో 15 ఇళ్లు ప్రమాదంలో ఉన్నాయన్నారు. తీవ్ర ప్రమాదంలో ఉన్న మూడిళ్లలోని ప్రజలు ఇప్పటికే ఇళ్లను ఖాళీచేసి, వేరేచోటుకు వెళ్లిపోయారని, మిగతా ఇళ్లలోని పరిస్థితి ఇంచుమించుగా ఇలాగే ఉందన్నారు. శారదానగర్ నివాసితులంతా రోజువారీ కూలీ, ఇతర పనులతో జీవనం సాగిస్తున్న అల్పాదాయ వర్గాల వారేనన్నారు. కొండచరియలు విరిగిపడడంతో తీవ్ర ప్రమాదంలో ఉన్న ఇళ్లకు తక్షణమే యుద్ధప్రాతిపదికన రక్షణగోడ నిర్మించడం ద్వారా పూర్తిగా కూలిపోకుండా చర్యలు చేపట్టాలని, బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి భారతి, కె.సుజాత, కె.త్రిమూర్తులు, మోహన్, ఎల్ పద్మ, దాలినాయుడు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పంట నష్టాలకు పరిహారమిచ్చి ఆదుకోవాలి


ఆనందపురంలో పాడైన వరిపైర్లను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- ఆనందపురం : మిచౌంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న వరి, ఇతర పంటలకు ప్రభుత్వపరంగా నష్టపరిహారాన్ని అందించి బాధిత రైతులను ఆదుకోవాలని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జికోరాడ రాజుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పొడుగుపాలెంలో తుపాన్ దెబ్బకు పాడైన పంటలను పరిశీలించారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ మీసాల సత్యనారాయణ, గొట్టిపల్లి ఎంపిటిసి దొంతల కనక రాజు, కర్రోతు సత్యనారాయణ, బంటుపల్లి అప్పారావు, బంటుపల్లి రమణ, షినగం సన్యాసినాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : తుపాను కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోతే రోడ్డెక్కి ఉద్యమిస్తామని దేవరాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ముషిడిపల్లిలో శుక్రవారం పర్యటించి రొంగలి చిన్నంనాయుడు, బొడ్డు అప్పారావు, రాయిపురెడ్డి రమణ, సోమిరెడ్డి గోవింద రొంగలి దేముడు తదితర రైతుల పొలాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. అన్నదాతలతో మాట్లాడి నష్టాన్ని తెలుసుకున్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు.

అనకాపల్లి:మిచౌంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని తుమ్మపాల, బవులువాడ తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పొలాలను అటు ప్రజా ప్రతినిధులు గాని ఇటు అధికారులు గానీ ఇప్పటికీ దాకా పరిశీలన చేయకపోవడం చాలా దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, చెల్లూరు నాగరాజు, దేవుడు బాబు, నరాలశెట్టి సత్యనారాయణ, వియ్యపు రాజు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల 9న ఉదయం 9గంటలకు బిసి రోడ్డులోని టిఎస్ఆర్ కల్యాణమండపంలో గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని సంఘ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణు కల్యాణ్ పాల్గొని విద్యార్థులకు పరీక్షలు రాసే విధానంపై పలు సూచనలు, సలహాలను తెలియజేస్తా రన్నారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయడంపై అవగాహన కల్పిస్తారన్నారు. గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉపవిద్యాశాఖాధికారి, దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. విద్యార్థులతోపాటు జిప్సా కార్యవర్గసభ్యులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు మానవ హక్కుల దినోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- గాజువాక : ఈనెల 10న అగనంపూడిలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల ఛైర్మన్ వెలుగుబంటి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జివిఎంసి 76వ వార్డు నడుపూరులో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్యక్రమానికి దేశంలోని 18 రాష్ట్రాల నుండి అసోసియేషన్ ప్రతినిధులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు అధికారులు రానున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ విశాఖ జిల్లా ఛైర్మన్ ప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రా ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరు వెంకటరమణ, జాజుల వెంకటేశ్వరరావు, మడుగుల జగ్గారావు పాల్గొన్నారు

ఘనంగా కెకె.రాజు జన్మదిన వేడుకలు


జన్మదిన కేకు కట్ చేస్తున్న కెకె.రాజు, పక్కనే మంత్రి అమర్

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె రాజు జన్మదిన వేడుకలను బాలయ్యశాస్త్రి లేఔట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైసిపి శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమరనాథ్, విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పలువురి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యనేతల సమక్షంలో కెకె.రాజు కేకు కట్ చేయగా, అందరికి పంచారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు, యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన కెకె.రాజు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గెలిచిన ఎమ్మెల్యేల కంటే బాగా పనిచేసి, ఉత్తర నియోజకవర్గాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కెకె.రాజును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, సురేష్‌రాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, కార్పొరేటర్లు, తాజా, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం కెకె. రాజు మాట్లాడుతూ తన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

సీతమ్మధార : కెకె. రాజు జన్మదినం సందర్భంగా విశాఖ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కైలాసపురం పోర్ట్ హాస్పిటల్ వద్ద డిస్ట్రిక్ట్ మెన్ అండ్ విమెన్ సబ్ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 2023 పోటీలను జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వర్లు, ఎపి స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ బి.లక్ష్మణ్ దేవ్ , ఆర్ఒసి సెక్రెటరీ బి.నాగేశ్వర్, 14వ వార్డు కార్పొరేటర్ కరారి అనిల్‌కుమార్ రాజు, 43వవార్డు కార్పొరేటర్ పి ఉష్‌శ్రీ , సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల ఫైనల్ ఈనెల 10న జరుగుతుందని, విజేతలకు కెకె.రాజు బహుమతులను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ నీలి రవి, నిర్వాహకులు మామిడి శ్రీను, ఎన్‌టిఆర్ రెడ్డి, బులుసు జగదీష్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు భోజన వితరణ

ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె. రాజు జన్మదిన సందర్భంగా 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వద్దులకు భోజన వితరణ చేపట్టారు. స్థానిక వార్డు కార్పొరేటర్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ పాల్గొని అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు హరిపట్నాయక్, రాజుయాదవ్, నాని బాబు, నాయుడు, దుర్గేష్, బాబూరావు, మాత ఈశ్వర్, పైడి నాగరాజు, నరసారావు, శ్యామ్, ఆదిలక్ష్మి తవుడమ్మ, సువర్ణ, 55వవార్డు నేత దుప్పలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

500మందికి అన్నసమారాధన

కెకె. రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని 46వ వార్డు శివాలయంలో 500 మంది అయ్యప్పస్వాములకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఈశ్వరరావు, అప్పలరెడ్డి, చిన్న గుడి ధర్మకర్తలు పాల్గొన్నారు.


అన్నసమారాధనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ సతీష్

తుపాను బాధిత రైతులకు

ఎకరాకు రూ.30 వేలు పరిహారం చెల్లించాలి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మిచౌంగ్ తుపానులో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం, రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను దాటికి మండలంలోని వేలాది ఎకరాలు నీట మునగడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వర్షాలు తగ్గి నాలుగు రోజులు గడుస్తున్నా పొలాల్లో నీరు పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో పొలాలు కుళ్లిపోయి పశుగ్రాసానికే కూడా పనికి రాకుండా పోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి పంట నష్టాన్ని అంచనా వేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దారు వినయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిని జ్యోష్న కుమారీలకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఆడారి రమణబాబు, కాంగ్రేసుల లక్ష్మి , బొడ్డేడ సూరప్పారావు, పెంటకోట రమణ అప్పారావు, ఆడారి నీలకంఠరావు దొడ్డి శివ సత్యనారాయణ, ఆళ్ల రాము, బొడ్డేడ గోవిందరావు, ఆడారి వెంకట అప్పారావు, ఆడారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తుఫాన్ లో నష్టపోయిన రైతులకు సహాయం చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కె రామ సదాశివరావు శుక్రవారం వ్యవసాయ అధికారి రాజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మునిగిపోయిన ప్రాంతంలో పర్యటించడం జరిగిందన్నారు. రైతులు కౌలు రైతులు వరి పంటపై పెట్టిన పెట్టుబడి వివరాలను తెలిపే ఆర్థికంగా నష్టపోయామని కన్నీరు మున్నీరు పెడుతున్నారని ఆయన అధికారి వద్ద ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో , శరగడం కన్నుం నాయుడు, కాంగ్రేసుల బాబురావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన సిపిఎం నేతలు

సబ్బవరం : తుఫాను కారణంగా వరి పంట వేసుకొని నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి కోరారు. శుక్రవారం తుఫాను వలన దెబ్బతిన్న వరి పంట పొలాలను గ్రామ నాయకులు యర్రా సోంబాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు వెంటనే సందర్శించి ఏ ఒక్క రైతుని విడిచిపెట్టకుండా రైతులందరికీ న్యాయం జరిగేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జెట్టి దేముడమ్మ, యర్ర రమణ, లక్ష్మీ, మహాలక్ష్మి, ముమ్మన సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నేలమట్టమైన వరి పంటను పరిశీలిస్తున్న సత్యవతి

రైతులను ఆదుకోవడంపై ఎమ్మెల్యేకు శ్రద్ధ లేదు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బస్సు యాత్ర మీద ఉన్న శ్రద్ధ తుఫాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ కి లేదని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన మండలంలోని వడ్డాదిలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో గల వందలాది ఎకరాల్లో వరి, చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఒక్కో ఎకరాకు 30 వేల రూపాయలు వరకు పెట్టుబడి పెట్టిన రైతులు గింజ కూడా తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారని, కానీ వారిని ఆదుకోవడానికి మాత్రం ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. తుఫానులో నష్టపోయిన రైతులును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాలింగ తాతలు, గోకవాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ప్రైవేటు భూములను కబ్జా చేస్తున్న భూ బకాసురులకు అడ్డుకట్ట వేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక శుక్రవారం తాసిల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ భూకబ్జాలపై సమగ్ర చారణ జరిపించాలని, ప్రభుత్వ భూములకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. కొంతమంది భూకబ్జాదారులు అమాయక రైతుల భూములు కూడా కబ్జా చేసి దోచేస్తున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి భూ బకాసురుల్లాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమలను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో శల్య దశలో ఉన్న సహకార చక్కెర కర్మాగారాలకు ఆర్థిక సహకారం అందించి రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరుతూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి వినతి పత్రం అందజేశారు.అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని చక్కెర కర్మాగారాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత ఆర్థిక సంక్షోభంపై, ముఖ్యంగా గోవాడ, తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాకలోని చక్కెర కర్మాగారాలు ఆర్థికంగా చితికిపోయిన పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫ్యాక్టరీలు చితికి పోవటం వలన స్థానిక వ్యవసాయ, ఇతర అనుబంధ రంగాలు, ఆయా సంస్థలపై ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోందన్నారు. తన అభ్యర్ధనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణలోకి తీసుకుని అనకాపల్లి జిల్లాలోని చక్కెర కర్మాగారాలకు ఆర్థిక సహాయ పథకాన్ని త్వరితగతిన అమలు చేసేలా కృషి చేయాలని కోరుతున్నామన్నారు.

ఆదాయపు పన్ను పై సానుకూల స్పందన

మునగపాక రూరల్ : ఆదాయపు పన్ను నుండి సహకార సంఘాలకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎంపి బివి.సత్యవతి కలిసి వినతిపత్రం సమర్పించారు. 2017 సంవత్సరం నుండి ఆదాయపు పన్ను చెల్లించాలని కోరుతూ ముందస్తు సమాచారం లేకుండా సహకార సంఘాలకు ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ నుండి నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. మండలంలోని నాగులపల్లి, మునగపాక, చూచుకొండతో పాటుగా పలు మండలాల సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సిబ్బంది ఇటీవల పార్లమెంటు సభ్యురాలు సత్యవతికి వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా ఎంపీ సత్యవతి కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను కలిసి సహకార సంఘాలకు ఆదాయపు పన్ను మినహాయింపుపై ఆమె చర్చించినట్లుగా దానిపై నిర్మల సీతారామన్ సానుకూలంగా స్పందించినట్లు వర్మ ప్రకటనలో పేర్కొన్నారు.



కేంద్ర ఆర్థిక మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సత్యవతి



కోలాటం బృందంతో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు

కార్తీక ఏకాదశి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కార్తీక మాస ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెంటకోట ధనలక్ష్మి నేతృత్వంలో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. గవరపాలెం పెద రామ కళా తరంగిణి టీమ్, చిన సంపత పురం శ్రీసంపత్ వినాయక కోలాట టీమ్, ఎస్విఐ కాలేజ్ జంక్షన్ శ్రీరామ సత్యదేవ కోలాటం టీమ్ పాల్గొని కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న వయసులోనే 176 గ్రామాలలో కోలాటం నేర్పించి టీములుగా తయారు చేసిన పెంటకోట ధనలక్ష్మిని ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కొణతాల కృష్ణం రాజు, వాసుపల్లి తాతయ్యలు, కాంగ్రేసుల రాము, కొణతాల త్రినాథ్ రావు, మెలిపాక ఈశ్వరరావు, సింగంపల్లి నాగరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని శైవ క్షేత్రాలలో కార్తీకమాస ఏకాదశి సందర్భంగా శుక్రవారం సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులతో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. తిమిరాం ఉమామహేశ్వరి, పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వేకువ జామున నుంచి పూజలు ఆలయ అర్చకులు కామేశ్వరరావు శర్మ జరిపించారు. చిన నందిపల్లి, బి.కింతాడ, ఎం అలమండ, కొత్త పెంట, దేవరాపల్లి తదితర గ్రామాల్లో ఏకాదశి పూజలు జరిగాయి.

ఎంవిఆర్‌ను కలిసిన ప్రసన్న కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి : అభిమానిగా వెళ్లి నటుడినయ్యానని క్యారెక్టర్ ఆర్టిస్ట్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నరసింగరావుపేట ఎంవిఆర్ ప్రధాన కార్యాలయంలో పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వర రావు(ఎంవిఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటినుంచో ఎంవీఆర్ సేవా కార్యక్రమాల కోసం వింటున్నానని, అవకాశం చూసి కలవాలని ఉద్దేశంతో వచ్చానన్నారు. రాజకీయాల్లోకి వచ్చి, ప్రజలకు మరింత సేవలు అందించే స్థాయికి ఎదగాలని ఎంవిఆర్‌ను ప్రసన్నకుమార్ కోరారు. అనంతరం ఎంవిఆర్‌కు సాలువా కప్పి బొకేను ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, సంజూ బాబు టీం పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని, రెండు రోజుల్లో నష్టపరిహారం అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు తెలిపారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నేలమట్టమైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవరు అధైర్య పడద్దన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడిఏ రామారావు, ఏ ఓ రంగాచారి, సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేశ్వరరావు,వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, వైసిపి నాయకులు,రైతులు పాల్గొన్నారు.

పంట నష్టంపై తక్షణమే సర్వే పూర్తి చేయాలి

అనకాపల్లి : ఇటీవల తుఫానుతో కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలపై తక్షణమే సర్వే పూర్తి చేయాలని ఎంపిపి గొర్లి సూరిబాబు ఆదేశించారు. అనకాపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రంగాచారి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తుఫాన్ వల్ల రైతుల పంటలు ఎన్ని హెక్టార్లు నష్టపోయారో తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం త్వరగా అందేలా అధికారులందరూ కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, వ్యవసాయ మండల సలహా సభ్యులు, అగ్రికల్చర్ అధికారి ఏజీ, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని ఎం.అలమండ గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బూడి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు తమ ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో రైతులు కొంతమేర అప్రమత్తమయ్యారన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రైతు దళారీ వ్యవస్థ మీద ఆధారపడే వారిని సీఎం జగన్ పరిపాలన విధానాల వలన దళారీ వ్యవస్థకు తావు లేకుండా, తూనికల్లో తేడా లేకుండా రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తుందని చెప్పారు. ధాన్యం రంగు మారిన కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైతులకు మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కెవిఎల్ఎం మూర్తి, డిఎంపి జయంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు, జిల్లా కోపరేటివ్ శాఖ అధికారి కిరణ్ కుమారి, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జడ్పిటిసి కర్రి సత్యం, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబూరావు, స్థానిక సర్పంచ్ దాడి జగన్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులను ఆదరించాలి

ప్రజాశక్తి -కసింకోట : వికలాంగులను ఆదరించాలని కశింకోట బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి అప్పారావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వికలాంగు ఉపాధ్యాయులు కొరుపోలు వెంకటేశ్వరరావు, ఐఈఆర్‌టి రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్య సమాజం నెలకొల్ప వచ్చునని జిల్లా మలేరియా అధికారి కే వరహాల దొర అన్నారు. మండలంలోని నాగులాపల్లి గ్రామంలోని 1-2 సచివాలయాల పరిధిలోని ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి నిల్వల వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆర్ దేవకాంత, ఎం ఉమా మహేష్, పిఎన్‌వి అప్పారావు, వి జగన్నాధ రావు, మౌనిక, గుణ లక్ష్మి, పద్మ, కుమారి, చంద్రకాంత, శ్రావణి, అరుణ పాల్గొన్నారు..

పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే లో భాగంగా వార్డు ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని, ఎకో వైజాగ్‌నకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎమ్‌హెచ్‌ఓ రవి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : జగనన్న కాలనీలలో సౌకర్యాల కల్పనలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని జనసేన పార్టీ నాయకులు ఆడారి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి సమీప జగనన్న కాలనీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం, పైగా లోతట్టు ప్రాంతం కావడం వలన చిన్నపాటి వర్షం కురిసిన జలమయమై ఇళ్ళ ముందు నీరు నిలిచిపోతుందని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం :విశాఖ మురళీ నగరకు చెందిన వనిత వాకర్స్ క్లబ్ ప్రతినిధి లావణ్య యూకే ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండల వికలాంగుల అనాధ ఆశ్రమ విద్యార్థులకు శుక్రవారం భారీగా నిత్యవసర సరుకులు అందజేశారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వికలాంగులను ఆదుకోవాలని సదుద్దేశంతో వాకర్స్ క్లబ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది. సుమారు 65 వేల రూపాయల విలువచేసే 25 కేజీల బియ్యం బస్తాలు 25, కందిపప్పు 17 కేజీలు, కూర బటాని 10 కేజీలు, పచ్చి శనగపప్పు 15 కేజీలు, ఎండుమిర్చి రెండు కేజీలు, చింతపండు 10 కేజీలు, రాగి పిండి ఐదు కేజీలు, విద్యార్థులకు స్నాక్స్ పండ్లు, కూరగాయలను జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్‌కు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం :మండలంలోని వంగలి గ్రామంలో శివాలయానికి వెళ్లే రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. వంగలి గ్రామంలో శుక్రవారం ఆమె సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. శివాలయం రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో గతంలో మేతకు వెళ్లిన ఒక పాడి గేదె దానిని తాకడంతో గేదె అక్కడికక్కడే మతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు యర్రా సింహాద్రప్పుడు, వరలక్ష్మి, విష్ణు, దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పరవాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని పెందుర్తి నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ మూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని లోకేశ్‌కి స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో దత్తు లక్ష్మణరావు, గండి రవి కుమార్, మాసవరపు అప్పల నాయుడు, భరనికాన బాబురావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ రావు, మొల్లి ముత్యాల నాయుడు, పైల ముత్యాల నాయుడు, రెడ్డి నారాయణ రావు, గండి దేముడు బాబు, కోటాన అప్పారావు, అట్ట సన్యాసి అప్పారావు, కరక దేముడు, వియ్యపు చిన్నా, బొండా సన్ని దేముడు, గొర్లి కణకారావు, పెద్ద ఎత్తున నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ఆఖరి రోజు నేడే

ప్రజాశక్తి- అనకాపల్లి

ఓటు నమోదుకు శనివారమే ఆఖరి రోజని, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోకుంటే వెంటనే నమోదు చేయాలని స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ ఎ.మహేష్ పిలుపునిచ్చారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉంటుందని, దానిని నమోదు చేసుకోవడం, వినియోగించుకోవడం మన "బాధ్యత"గా గుర్తించాలని కోరారు. ఈనెల 9 తుది గడువని,కాబట్టి మీకు దగ్గరలో ఉన్న ఓటరు నమోదు కార్యాలయానికి వెళ్లి మీ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపరచే సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకువెళ్లి బూత్ లెవెల్ అధికారి వద్ద మీ పేరును ఓటర్ల లిస్టులో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్లో వెబ్ సైట్ ద్వారా https://voterportal.eci.govin నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

10 రోజులు గడువు పొడిగించాలని టిడిపి లేఖ

ఓటరు నమోదుకు, జాబితాలో చేర్పులు- మార్పులు కొరకు మరో 10 రోజుల గడువు పొడగించాలని, ఉత్తరాంధ్రాలో వలస ఓటర్లు పై ప్రత్యేక దృష్టి సారించాలని, కొత్త ఓట్ల నమోదుపై యువతకు అవగాహన కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు లేఖ రాసినట్టు మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో మీ చౌంగ్ తుఫాను కారణంగా గత 5 రోజుల పాటు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యంత్రాంగం అంతా తుఫాను పైనే దృష్టి సారించారని, ఇతర రాష్ట్రాలలో వృత్తి రీత్యా వెళ్ళిన యువకులు ఓట్ల నమోదు చేసుకోలేక పోయారని, తెలిపారు. వారికి మరొక అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, మళ్ళ సురేంద్ర, పచ్చికూర రాము, శెట్టి వెంకట రమణ, భీమరశెట్టి శ్రీనివాసరావు, దొడ్డి రాము, బత్తుల శ్రీనివాసరావు, కాంద్రేగుల రాజు, అల్లంక భోగేష్, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో 140 కిలోమీటర్లు రోడ్ల ధ్వంసం

ప్రజాశక్తి -వడ్డాది

మిచౌంగ్ తుఫాను ప్రభావానికి అనకాపల్లి జిల్లాలో 140 కిలో మీటర్లు మేర రోడ్లు శిధిలమైనట్లు ఆర్ అండ్ బి ఎస్ఈ క్రాంతిమతి తెలిపారు. శిథిలమైన వడ్డాది పెద్దేరు వంతెనను శుక్రవారం ఈఈ రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36 కల్వర్టులు, 10 స్కవర్లు, 3 పెద్ద చెట్లు కూలాయని చెప్పారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.8 కోట్లకు, శాశ్వత నిర్మాణాలకు రూ.77.39కోట్లకు ప్రతిపాదనను పంపించమన్నారు. ఇప్పటికే పలుచోట్ల మరమ్మతు పనులు ప్రారంభించినట్లు చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న టిడిపి నేత తాతయ్యబాబు

మరమ్మతులు త్వరగా చేయాలి

వడ్డాది వంతెనకు త్వరగా మరమ్మతులు చేపట్టాలని టిడిపి చోడవరం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు ఆర్అండ్బి అధికారులకి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎస్ఇ వంతెనకు శుక్రవారం సాయంత్రాని కల్లా తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇస్తామని తెలిపారు. ప్రజల తమ సిబ్బందికి సహకరించాలన్నారు. డిఈ నాగ మనోహరరావు, ఏఈ సాయి, వైస్ ఎంపీపీ దొండా నారాయణ మూర్తి పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు అడ్డగింత



మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ ఫార్మా సిటీని ఆనుకొని ఉన్న తాడి గ్రామానికి పరిశ్రమలకు మధ్య ఉన్న గ్రీన్ బెల్ట్‌ను తొలగించి రాంకీ యాజమాన్యం నూతన చేపట్టిన పైప్ లైన్ నిర్మాణ పనులను శుక్రవారం తాడి గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రీన్ బెల్ట్ తొలగింపు చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, తాడి తరలింపు బాధితుల సంక్షేమ సంఘం నాయకులు బంతి కోరు గోవిందరాజు మాట్లాడుతూ తాడి గ్రామం కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడుతుందని, గ్రామానికి ఆనుకొని ఉన్న ఫార్మా పరిశ్రమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాన్ని తరలించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ప్రజలు ఇప్పటికే కాలుష్య తో అల్లాడుతుంటే రాంకీ యాజమాన్యం నూతన పైప్ లైన్ వేసి ఉన్న గ్రీన్ బెల్ట్‌ని కూడా తొలగించడం దారుణమన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పైప్ లైన్ నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు.

పిహెచ్‌డి, ఎల్‌ఎల్‌డిల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వాద్యాలయంలో పిహెచ్‌డి, ఎల్‌ఎల్‌డిల్లో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా, ఇంటర్డిసిప్లైనరీ విభాగం (సోషల్ సైన్స్, నాచురల్ సైన్స్)లలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పై విభాగలలో రెగ్యులర్, పార్ట్ టైం, ఎగ్జిక్యూటివ్ విధానంలో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. డిసెంబర్ 25వ తేదీ లోగా దరఖాస్తులు పంపవచ్చని, దీనికి సంబంధించిన అర్హతలు మరియు ఇతర వివరాల కొరకు విశ్వావిద్యాలయ వెబ్ సైట్ www.dsnlu.ac.in ను సంప్రదించాలని కోరారు.

31 మంది రైతులకు స్వల్పకాలిక రుణాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దుప్పుతురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 31 మంది సంఘ సభ్యులకు రూ.21,50,000 స్వల్పకాలిక రుణాలుగా పంపిణీ చేసినట్లు సంఘ సీఈవో రాజాన శంకర్రావు, సంఘ అధ్యక్షులు శెట్టి నాగేష్ తెలిపారు. 14 మంది సభ్యులకు భూమి తనకా రుణాలుగా 84 లక్షల 22 వేల రూపాయలు ఇచ్చినట్లు వెల్లడించారు. సంఘం ద్వారా 154 మంది వ్యక్తులకు కోటి 9 లక్షల రూపాయలు బంగారు ఆభరణాలు రుణాలు ఇచ్చామన్నారు.

రైతులను ముంచిన మిచౌంగ్

- 1500 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి-వడ్డాది : మిచౌంగ్ తుఫాను రైతులను నిలువనా ముంచింది. తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీటి ముంపులోనే ఇంకా కొనసాగుతున్నాయి. బుచ్చయ్యపేట మండలంలోని 10 గ్రామాలలో సుమారు 1500 ఎకరాలలో చెరకు, వరి, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. శుక్రవారం వర్షం తెరిపివ్వడంతో నీటి ముంపులో ఉన్న వరి పనలను కొంతమంది రైతులు ఒడ్డుకు చేర్చుతున్నారు. కోసిన పంట కొట్టుకుపోగా, కోతకు సిద్ధంగా ఉన్న పంట నెలవాలి నీటిలో కుళ్ళిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 10 రోజుల క్రితం వరకు వర్షాలు లేకపోవడంతో వరికి చీడపీడల బెడద ఎక్కువగా ఉండటంతో క్రిమిసింహారక మందులతో రైతులు వరిని కాపాడుకున్నారు. నేటి వరకు వరిని కాపాడుకున్న రైతాంగానికి మిచాంగ్ తుఫాన్ పీడకలను మిగిల్చింది.

ఓటర్ల నమోదు శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : జనసేన మండల కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు శిబిరాన్ని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా శుక్రవారం ఏర్పాటు చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు ఈనెల 8, 9 తేదీల్లో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జనసేన మండల కమిటీ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థి దరఖాస్తు ఫారం-6తో పాటు పాస్ ఫొటో, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్ కాపీ, ఆధార్ జిరాక్స్ కాపీ జత పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇందల వెంకట రమణ, మండల కన్వీనర్ కర్రి కనకరాజు, గండి దుర్గా ప్రసాద్, బలిరెడ్డి రామకృష్ణ, బొడ్డపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆద్య ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ సబ్ స్టేషన్ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీఆద్య హాస్పిటల్‌ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరవాడ సమీపంలోని ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కొత్త ప్రైవేట్ ఆసుపత్రిని నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు టిఎస్ రాజు, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, చుక్క రాము నాయుడు, వెన్నెల సన్యాసిరావు, రామారావు, గొర్లి గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనారు. శ్రీఆద్య ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, నాయకులు వియ్యపు చిన్నా కూడా తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు

ప్రజాశక్తి-కసింకోట : మండలంలోని తాళ్లపాలెం సచివాలయం ముందు బంగారుపేట శ్మశాన వాటికి వెళ్లే రోడ్డు భారీ వర్షానికి కొంత భాగం కొట్టుకుపోయంది. ఈ రహదారి గుండా శ్మశాన వాటికి ప్రజలు వెళుతూ ఉంటారు. రెండు రోజుల పాటు తుఫాన్ దాటికి కురిసిన వర్షాలకు పెద్ద గోయ్య ఏర్పడింది. తక్షణమే ఈ గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు ఒక భాగం కొట్టుకు పోయి పెద్ద గొయ్యి పడిన దృశ్యం



బియ్యం అందజేసిన యువ నాయకులు

25 కేజీల బియ్యం అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:తుపాన్ ప్రభావానికి ముంపునకు గురైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సరుకులు పాడయ్యాయి. ఈ మేరకు కాలనీలో ఉన్న వైఎస్ఆర్ సిపి యువ నాయకులు స్పందించి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు భోజనం నిమిత్తం 25 కేజీలు బియ్యంను అంగన్వాడీ టీచర్ దుర్గారాణి కు అందజేశారు. ఈ మేరకు దాతలకు దుర్గారాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మామిడి వరహాల బాబు, కల్లూరి మహేష్, గుద్దటి త్రిమూర్తులు, చేపల లోవరాజు, కల్లూరి సత్తిబాబు, మేడేటి శివ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సహాయం



సహాయం చేస్తున్న పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి - మాడుగుల:మిచౌంగ్ తుపాను బాధితులకు తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం మండలంలోని శివారు గిరిజన గ్రామాలలో ఆయన పర్యటించారు. శంకరం పంచాయతీలో గొట్టివాడ నుండి ప్రధాన రహదారి మార్గంలో వరద దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీని ప్రభావంతో కొత్తవలస వేలంపాడు, గొప్పూరు, రావిపాలెం, రాజంపేట గ్రామాల ప్రజలకు రవాణా సంబంధాలు తెగి పోయాయి. ఇబ్బందులకు గురవుతున్నటువంటి వారిని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు కలుసుకొని ధైర్యం చెప్పారు. వారికి తక్షణ సహాయం కింద నిత్యవసర సరుకుల నిమిత్తం పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అధికారులు వంతెన పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జనపురెడ్డి ఈశ్వరరావు, జనపురెడ్డి నూకరాజు, చిన్ని రాము,పేటూరి రాము, గుమ్మాల నానాజీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యస్.రాయవరం: తుఫాను దాటికి వరదతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు బైరా ఫౌండేషన్ అండగా నిలిచింది. శుక్రవారం ఉదయం మండలంలోని వెంకటాపురం, పెనుగొల్లు గ్రామాలలో వరద ముంపునకు గురైన ప్రాంతాలలోని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆపన్నులకు బైరా ఫౌండేషన్ ఎల్లవేళలా ఆపన్నహస్తం అందిస్తుందని డైరెక్టర్ ఎస్కె బషీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు నల్లపురాజు వెంకటరాజు, అమలకంటి అబద్దం అమలకంటి పాపారావు, గుర్రం రామకృష్ణ, ఆకేటి శాంతి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు బైరా పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:తుఫాన్ కారణంగా ముంపునకు గురై నష్టపోయిన నక్కపల్లి చేనేత కార్మికుల కుటుంబాలకు నిత్యవసరకులు అందించేందుకు బైరా ఫౌండేషన్ అధినేత బైరా దిలీప్ చక్రవర్తి ముందుకొచ్చారు ఈ మేరకు నష్టం వాటిల్లిన కుటుంబాల పరిస్థితులను రాష్ట్ర టిడిపి మహిళా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ,జనసేన అనకాపల్లి పార్లమెంట్ నాయకులు గెడ్డం బుజ్జి, మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి యువ నాయకులు మీగడ సత్యనారాయణమూర్తిల ద్వారా తెలుసుకున్న ఆయన వారికి నిత్యవసర సరుకులు అందజేసేందుకు ముందుకు వచ్చారు. బైరా ఫౌండేషన్ అధినేత దిలీప్ చక్రవర్తి సోదరుడు బ్రహ్మనాయుడు, బషీర్ చేతుల మీదుగా చేనేత కాలనీలో బాధితులకు సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, ఆకేటి శాంతి, అల్లాడ తాతారావు, సన్యాసిరావు, గిడుతూరి బాబ్జి ,కోసూరి నాని, కోసూరి శ్రీను తదితరులు ఉన్నారు.



సరుకులు ఇస్తున్న బైరా అధినేత దిలీప్‌చక్రవర్తి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ట్రస్ట్ ఛైర్మన్

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలోని హైస్కూల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ తరఫున శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అల్లాడ సురేష్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు తమ వంతు సాయంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, హరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత హరి, ఊడి చక్రవర్తి, రామచంద్ర, చిరంజీవి, దుర్గ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి

ప్రజాశక్తి -కోటవురట్ల:ఓటర్ నమోదు తొలగింపులు సవరణలు పట్ల ఫిర్యాదు రాకుండా అర్హత కలిగిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మండల వ్యాప్తంగా గల 52 పోలింగ్ కేంద్రాల సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 9వ తేదీతో చేర్పులు సవరణలు, తొలగింపులకు ఆఖరు కానుండటంతో సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి పొరపాట్లు దొర్లినా ఉపేక్షించేది లేదని సందర్భంగా ఆమె సిబ్బందిని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా 292 పోలింగ్ కేంద్రాలలో 2325 వివిధ దరఖాస్తులను సవరణ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాలను గుర్తించామని సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, సహా పలువురు ఇంజనీర్లు, సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామలక్ష్మి

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామం ముఖద్వారమైన బ్రిడ్జి వద్ద వీరాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామం వీరాంజనేయ కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. సమీప గ్రామాలైన దెబ్బలపాలెం, పాకలపాడు, వెంకటాపురం గ్రామాల వారు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాల స్వీకరించి అన్న సమారాధనలో పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి–గొలుగొండ: గొలుగొండ గ్రామంలో ఈ నెల 13న వైయస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కసిపల్లి అప్పారావు తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. శుక్లము ఆపరేషన్‌కు ఎంపిక అయిన నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శస్త్రచికిత్స(లెన్సు) అమర్చి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు, మీ బ్యాంక్ అకౌంట్, పాస్‌బుక్ తీసుకురావాలన్నారు.

డేటా సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి–పాడేరు:జిల్లా సర్వే, భూమి రికార్డుల కార్యాలయపు జిల్లా డేటా ప్రోసెసింగ్ సెంటర్ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు కలెక్టరేట్ భవనంలో శుక్రవారం ప్రారంభించారు. డేటా ప్రోసెసింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. మరొక రెండు కంప్యూటర్లకు కలెక్టరేట్ నుండి నిధుల మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అనకాపల్లిలో హాజరైన నేతలు



కరాసలో మాట్లాడుతున్న శ్రీధర్

ప్రజాశక్తి–గొలుగొండ:అర్హులందరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా సిఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసీలు పాల్గొన్నారు.

నక్కపల్లి :ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని కాగిత గ్రామంలో శుక్రవారం ఏపీకు జగనే సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. సచివాలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బోర్డుని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు శ్రీరం నరసింహమూర్తి, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాల బాబు, నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జ్ ఎలమంచిలి తాతబాబు, లోడగల చంద్రరావు, అల్లు రమణ తదితరులు పాల్గొన్నారు .

అనకాపల్లి:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద అన్నారు. అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పెద్ది శెట్టి గోవింద ముందుగా మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డు ప్రారంభించారు. వాలంటీర్లు అందరికీ జగనన్నే మా నమ్మకం అనే కిట్లను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరిపల్లి శోభ, జంగాలపాలెం సర్పంచ్, కుంచంగి సర్పంచ్ నాగేశ్వరరావు, కుంచంగి సచివాలయం కన్వీనర్ పల్లేల సాయి, సుందరయ్య పేట వైస్ సర్పంచ్ బాదపు హరికృష్ణ, అరవింద్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మండలంలోని శంకరం గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ ప్రోగ్రాంలో ఆంధ్రప్రదేశ్ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, జెడ్పి వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, పెద్ది శెట్టి గోవింద పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి దొండ రాంబాబు అన్నారు. మండలంలోని పిపి అగ్రహారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ సర్కార్ పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, మాజీ ఎంపీపీ కోరుకొండ అప్పలనాయుడు, దాకారపు నాగరాజు సర్పంచ్ ఇందల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి ఎనిమిదో వార్డులో ఎపికి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నాలుగున్నరేళ్లలో వార్డులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు, నాయకులు.

కరాస: జివిఎంసి 52వ వార్డు సాకేతపురం కరాసాలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.50లక్షలతో నిర్మించనున్న యుజిడి పనులకు శంకుస్థాపన చేశారు. వార్డు పరిధిలో రూ.19కోట్లతో చేపట్టిన వివిధ పథకాల బోర్డును, మా నమ్మకం నువ్వే జగన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆల్డా కృష్ణ, వెదుళ్ళ శ్రీను, జియ్యాని మారుతి, శ్రీదేవివర్మ పాల్గొన్నారు.

పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు గాయత్రి నగర్ జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో లో గాదె రోశిరెడ్డి, పిల్లా రమణ బాబు, పోతిన మూర్తిబాబు, సియాద్రి కనకరాజు, కొండపల్లి వరలక్ష్మి, వాండ్రాసి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ ఆధ్వర్యంలో ఎపికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు.. విశాఖ జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి,కన్నేటి సుబ్బా రెడ్డి, సూర్యారావు, మైనార్టీ నాయకులు హుస్సేన్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

15 నుంచి ఆడుదాం - ఆంధ్రా

ప్రజాశక్తి -నక్కపల్లి:ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఆడుదాం - ఆంధ్రాను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ రత్నం సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 15వ తేదీ నుండి 20 వ తేదీ వరకు ప్రతి గ్రామంలోనూ ఐదు రోజులపాటు క్రీడా పోటీలను పక్కాగా నిర్వహిం చాలన్నారు. ఎక్కువ మంది క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈ ఓ పిఆర్‌డి సత్యనారాయణ, ఏవో సీతారామరాజు, ఎంఈఓ నరేష్, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.



కోతకు గురైన రోడ్డు

తుపానుకు రహదారి కోత

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రమణయ్య పేటలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి రోడ్డు కోతకు గురైంది. పోలవరం కాలవలోకి చేరిన వర్షపు నీరు భారీగా రోడ్డుపై ప్రవ హించడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో రమణయ్యపేట, రేబాక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు తప్ప ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఆవకాశం లేకుండా పోయింది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరారు .

ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించిన వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి విశాఖకు చెందిన తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఫిర్యాదు చేశారు. అనంతరం అమరావతిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తను చేసిన ఫిర్యాదుపై ఎలక్షన్ కమిషన్ స్పందించిన తీరును వివరించారు. అనంతరం మీడియాతో రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జైలులో ఉంటేనే ప్రజలు క్షేమంగా ఉంటారన్నారు. విశాఖపట్నం నుంచి పరిపాలన సాగిస్తానని చెప్పిన జగన్ మరోసారి మాట తప్పారని అన్నారు. ఓట్ల తొలగింపులో వాలంటీర్ వ్యవస్థ కీలకంగా పనిచేసిందన్నారు.

గరుడ యాప్ ద్వారా 24 లక్షలకుపైగా ఓట్లను తొలగించిన విషయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ క్రమంలోనే 10 సంవత్సరాల నుంచి బెయిల్‌పైన ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎన్నికలలో పాల్గొనకుండా నిరోధించాలని కోరినట్టు తెలిపారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్రంలో పర్యటించాల్సిందిగా అభ్యర్థించానన్నారు. ఇదే ఫిర్యాదు కాపీని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోం శాఖ మంత్రి కార్యాలయాలతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కూడా సమర్పించినట్టు తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదన్నారు.

సైబర్ నేరాలపై విస్తృతంగా ప్రచారం

- ఎస్‌పి మురళీకృష్ణ- పలు పోలీస్ స్టేషన్లు పరిశీలన



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-యస్.రాయవరం:సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన చేపడుతున్నట్లు జిల్లా యస్పీ కెవి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం అడ్డురోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయంను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్‌ల్లో కేసుల పురోగతిని సమీక్షించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. దొంగతనాలు నివారణ, సైబర్ క్రైం వంటి పలు అంశాలపై గడచిన రెండు సంవత్సరాలుగా జిల్లాలోని పలు గ్రామాలలో విద్యా సంస్థలలో మొబైల్ టీం ద్వారా ప్రచారం చేపట్టామన్నారు. పాత నేరస్థులు, రౌడీషిటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచడంతో పాటు వారికి సకాలంలో కౌన్సిలింగ్ ఇచ్చే విధంగా సిబ్బందికి సూచనలిచ్చారు. జాతీయ రహదారి వెంబడి దాబాలలో మద్యపాన సేవించడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాలలో శుభకార్యాలకు, విహార యాత్రలకు వెళ్ళే వారు స్థానిక పోలీసులకు తెలిపి వారి సహకారం పొందితే దొంగతనాలు నివారించవచ్చన్నారు. ఆయన వెంట నర్సీపట్నం ఏఎస్పీ అదీప్ సింగ్ రానా, సిఐ అప్పన్న యస్ ఐలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నక్కపల్లి:నక్కపల్లి సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లను శుక్రవారం జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లో కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీసు స్టేషనులో నిర్వహించే పలు రికార్డులు పరిశీలించి... నమోదైన కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్ తదితర రికార్డ్స్ ను క్షుణంగా పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో కేసుల నమోదు, నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈ తనిఖీల్లో నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా, నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకన్న, నక్కపల్లి ఎస్సై విభీషణరావు, ఎలమంచిలి ట్రాఫిక్ ఎస్సై ఈశ్వరరావు పాల్గొన్నారు.

తుపానుకు దెబ్బతిన్న పంటల పరిశీలన



చీడికాడలో పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -చీడికాడ:మిచౌంగ్ తుఫాను తీవ్రత మూలంగా దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిని ఏ.కృష్ణవేణి సందర్శించారు. మండలంలో చీడికాడ, చిన్న గోగడ, తుని వలస, ఇంటి పాలెం గ్రామాలలో తుఫాన్ కారణంగా నేల కొరిగిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేలపై పడిపోయిన వరి చేనులను పైకి లేపి కంకిలపై ఉప్పు ద్రావకం చల్లితే గింజలు రంగు మారకుండా ఉంటాయని తెలిపారు. నష్టపరహారం కొరకు నివేదిక తయారు చేసి పంపిస్తామని ఆమె అన్నారు. మండలంలో సుమారుగా 142 హెక్టార్ల వరి పొలాలు నేల కొరిగాయని, అందులో 75 హెక్టార్లు నీటిలో వరి కంకులు నీటి మునిగినట్లు అంచనా వేసినట్లు అన్నారు. తుఫాన్ కి నష్టపోయిన రైతులు సంబంధిత గ్రామాల్లో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లను లేదా ఉద్యాన శాఖ సహాయకులను కలిసి అందజేయాలని ఆమె సూచించారు.

మాడుగుల : మండలంలో తడిసిన వరి పంటపై అనేక గ్రామాల్లో అవగాహన కల్పించి మండల వ్యవసాయ అధికారి సూచనలు అందించారు. శుక్రవారం మండలంలో సాగరం, ఎం కోటపాడు, కేజే పురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎం వాసుదేవరావు పర్యటించి రైతులకు సూచనలు అందించారు. పంట నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను అధికారులకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం కోటపాడు నాయకులు సానాపతి గంగాధర్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సనాపతి కొండలరావు, సాగరం నాయకులు కోట్ని సన్యాసినాయుడు, కేజే పురం సూరిశెట్టి గోవింద్, ఆర్ బి కే సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



మాడుగులలో పిచికారీ చేయిస్తున్న అధికారులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న అప్పలురాజు

ప్రజాశక్తి -యస్.రాయవరం:మిచౌంగు తుఫాన్ కారణంగా వరహానది ఉప్పొంగి ప్రవహించి పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.మండలంలోని ధర్మవరం అగ్రహారంలో పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం మానవత్వంతో స్పందించి ఉదారంగా ఆదుకోకపోతే రైతులు వ్యవసాయం చేయడం కష్టమన్నారు.ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగి, పండిన పంటలకు గిట్టుబాటు లేక తీవ్రంగా నష్టపోతూ వ్యవసాయానికి దూరమవుతున్నారన్నారు. ఎకరానికి ముప్పై వేల నుండి ముప్పై ఐదు వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులను తపాను కోలుకోలేని దెబ్బ తీసిందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. పంటల పరిశీలనకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో మాట్లాడుతూ, నష్టపోయిన రైతులను ఆదుకోవాలన అప్పలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోవిందరావు, ఎన్.వెంకట రమణ, కె.రాము, కె.రమణ, ఎం.కుమారి జీ.భూపతి, ఎం.వరహాలరావు, సాయి పాల్గొన్నారు.

రోలుగుంట:ఆదివాసి గిరిజన రైతులు తుఫాన్ పంటలు కోల్పోయిన గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో రోలుగుంట తహశీల్దార్ వరహాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ రోలుగుంట మండలం రత్నంపేట, ఆర్ల పంచాయతీ పరిధిలో ఆదివాసి గిరిజనులు సోడి, సామ, మెట్టు ధాన్యం, వరి వంటి పంటలో పండిస్తున్నారన్నారు. గత మూడు రోజులు కురిసిన వర్షాలకు గిరిజనుల పంటలు పూర్తిగా నేల మట్టమయ్యాయన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గిరిజనులకు పంట నష్టపరమైన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకు రుణాలు రీషెడ్యూల్ చేయాలన్నారు. ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిలో నరసయ్య. కొర్ర కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంటలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు